# సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 8 । ఆగస్టు । 2023






**నిరాడంబరంగా 'అథ్లెటిక్స్' చాంపియన్‌షిప్**

హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిరుత్సాహ పరిచాయి. - 8లో▸



**సేవాస్ఫూర్తితో పనిచేయాలి**

విశ్వబ్రాహ్మణులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0⁰ /25.0⁰

**వాతావరణం**

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

భూపాలపల్లి అర్బన్: ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగ 2.0 కాంపెయిన్ పురస్కరించుకొని భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా శాఖ కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు భూపాలపల్లి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ భూక్య విజయ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.25 విలువచేసే 20నుంచి 30 అంగుళాలు కలిగిన జాతీయ జెండాలను భూపాలపల్లి పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తపాలా కార్యాలయాలకు వెళ్లలేని వారు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఎక్కువ మొత్తంలో జాతీయ జెండాలు కావాల్సిన వారు సమీపంలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

### రామప్పలో జెఫ్‌జాన్స్ సందడి



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప దేవాలయాన్ని సోమవారం అమెరికాకు చెందిన జెఫ్ జాన్స్ సందర్శించి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వివరించగా రామప్ప బ్యూటిఫుల్ టెంపుల్ అని కొనియాడారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు అంటే గౌరవమని, దేవాలయాల సందర్శన, భారతదేశ చరిత్రను తెలుసుకోవడం ఇష్టమని తెలిపారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు.

### కరిష్మాకు ద్వితీయ బహుమతి



ఏటూరు నాగారం: హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఎండీ కరిష్మా రాష్ట్ర ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఏటూరు నాగారం స్పోర్ట్స్ క్రీడాకారిణి కరిష్మాను ములుగు అథ్లెటిక్ కార్యదర్శి పి. వెంకట్‌రెడ్డి, ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి, నాగరాజు అభినందించారు.

### జ్వరంతో యువతి మృతి

వాజేడు: తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఓ యువతి పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. ఈ ఘట న మండల పరిధిలోని నాగారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అంగవెల్లి గ్రామానికి చెందిన కుశాల్, సుశీల కూతురు కవిత(22) నాగారానికి చెందిన గొంది మధు, కవిత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. 20 రోజుల క్రితం మధు.. కవితను తన ఇంటికి తీసుకొచ్చాడు. మంచి ముహూర్తాలు లేకపోవడంతో కొద్ది రోజులు ఆగి పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. ఈ క్రమంలో కవితకు జ్వరం రావడంతో వైద్యం చేయిస్తున్నాడు. ఆదివారం జ్వర తీవ్రత ఎక్కువ కావడంతో ఏటూరునాగారం తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె సోమవారం మృతి చెందింది. కవితకు మలేరియా, టైఫాయిడ్ ఉండడంతో పాటు ప్లేట్‌లెట్స్ పడి పోవడంతోనే చనిపోయినట్లు వైద్యులు తెలిపినట్లు బంధువులు వెల్లడించారు.

### పార్టీ బలోపేతానికి పాటుపడాలి

వెంకటాపురం(కె): పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సతీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు పార్టీని బూత్ స్థాయిలో అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి లక్ష్మి, అంకాల దుర్గ, రామెల్ల శేఖర్, హేమ సుందర్, లక్ష్మీపతి, మట్టి రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చదువు సాగేదెలా..?

**జిల్లాలో 360 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు**

- పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు
- పలు సబ్జెక్టుల్లో ఇంకా ప్రారంభం కాని బోధన
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు



భూపాలపల్లి మండలం ఆజాంనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 52మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులకు గాను నలుగురు మాత్రమే ఉన్నారు. తెలుగు, సోషల్, బయోసైన్స్ టీచర్లు నాలుగేళ్ల క్రితం బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయులను నియమించలేదు. ప్రతి ఏడాది మూడు, నాలుగు నెలలు మాత్రమే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. ఈ ఏడాది ఇంకా పలు సబ్జెక్టుల బోధన ప్రారంభమే కాలేదు.

భూపాలపల్లి అర్బన్: పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా జిల్లాలో పలు పాఠశాలల్లో ఇప్పటివరకు కొన్ని సబ్జెక్టుల బోధన ప్రారంభం కాలేదు. జిల్లాలో నాలుగేళ్లుగా ఉపాధ్యాయుల ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకుండా సర్దుబాటుతో నెట్టుకొస్తోంది. జిల్లావ్యాప్తంగా 360 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. బయోసైన్స్, సోషల్ స్టడీస్, ఎస్జీటీల ఖాళీలు అధిక సంఖ్యలో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మన ఊరు-మన బడి పేరుతో పాఠశాలల్లో పనులు చేపడుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయుల ఖాళీల భర్తీపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలో 316 ప్రాథమిక, 43 ప్రాథమికోన్నత, 69 ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 27వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో 1,800 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 1,440 మంది మాత్రమే ఉన్నారు. 360 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. 69 ఉన్నత పాఠశాలల్లో సగానికిపైగా ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత వెంటాడుతోంది. 2019-20 విద్యా సంవత్సరంలో విద్యా వలంటరీలు బోధన చేశారు. 2020-21 విద్యా సంవత్సరంలో కరోనా నేపథ్యంలో ఆన్‌లైన్ పాఠాలు నిర్వహించారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో నామమాత్రంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి బోధన చేయించారు. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు విద్యావలంటరీలను కూడా నియమించకపోవడంతో పలు సబ్జెక్టులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు.

**అయోమయంలో విద్యార్థులు..**

ఉన్నత పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలి. కానీ జిల్లాలో చాలా పాఠశాలల్లో ఈ విధంగా ఉపాధ్యాయులు లేరు. ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు 5 తరగతులకుగాను ఆరు సబ్జెక్టుల టీచర్లు ఉండాలి. పలు పాఠశాలల్లో ముగ్గురు నాలుగు టీచర్లు ఉన్నారు. ప్రాథమిక పాఠశాల్లో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు 6 తరగతులు ఉంటాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు చొప్పన మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఒక్క ఉపాధ్యాయుడు ఉన్న ప్రాథమిక పాఠశాల ఐదు తరగతుల విద్యార్థులను ఒకరే చదివిస్తున్నారు. విద్యార్థులకు ఇప్పటివరకు పాఠాలు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

### మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం..



సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో 6వ తరగతి నుంచి ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటివరకు మాకు పాఠాలు చెప్పడం ప్రారంభమే కాలేదు. కొత్త సార్లను ఎప్పుడు పంపిస్తారో తెలవదు. రెండు నెలల నుంచి ప్రతి రోజు బడికి వచ్చి వెళ్తున్నాం. ఉన్న సార్లు మాత్రమే నాలుగు సబ్జెక్టుల పాఠాలు చేబుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.

- పసులోటి రోహిత్, 9వ తరగతి, ఆజాంనగర్, ఉన్నత పాఠశాల

### సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించాం..



జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వాస్తవమే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న స్థానాల్లో ఉపాధ్యాయులను పంపించే కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 100మంది ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశాం. వారం లోపల ఉపాధ్యాయులు వెళ్లి పాఠాల బోధన ప్రారంభిస్తారు.

- రాంకుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ

# తాపీమేస్త్రీ కూతురు సివిల్ ఎస్ఐగా..



మనీషా

కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన వస్కుల రాంచందర్, వనజ దంపతుల కూతురు మనీషా సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. మనీషా తండ్రి తాపీమేస్త్రీ పనిచేస్తుండగా.. తల్లి మహిళా సంఘాల్లో సీఏగా పనిచేస్తున్నారు. మనీషా చిన్నప్పటినుంచి బాగా చదువుతుండేది. పోలీస్ ఈవెంట్లలోనూ మంచి ప్రతిభ కనబర్చింది. తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికవడం ఆనందంగా ఉందని మనీషా తెలిపారు. కాగా, మనీషాను గ్రామస్తులు అభినందించారు. తమ కూతురు నమ్మకాన్ని నిలబెట్టిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మడికొండ

**ఉమ్మడి జిల్లాలో పోలీస్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కథనాలు** - వివరాలు 8లో▸

# అర్హులకు పథకాలు అందించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు సత్వరమే అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు రూ.లక్ష ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి పలు అంశాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతివారం 45 గొర్రెల యూనిట్లు గ్రౌండ్ చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతివారం 9 యూనిట్లు గ్రౌండ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో పెండింగ్ గొర్రెలు యూనిట్ల గ్రౌండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలుచేసి త్వరితగతిన లబ్ధిదారులకు యూనిట్లు అందేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అటవీశాఖ అధికారిణి లావణ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సునీత, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రంగారావు పాల్గొన్నారు.

# గద్దర్ మృతి తీరనిలోటు



టేకుమట్ల: ప్రముఖ కవి, తెలంగాణ ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటని జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం అన్నారు. సోమవారం వేర్వేరుగా వారు గద్దర్ చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన గళంతో అనేక పోరాటాలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైనాల రవీందర్, బండ శ్రీకాంత్, కుమార్, వీరేశం, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రిజర్వేషన్ అమలుచేయాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రతిపాదికన బీసీలకు 56శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బీసీల హక్కుల సాధనకోసం జిల్లాస్థాయి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నాయకులు శేఖర్‌నాని అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా సత్యనారాయణ హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు జనాభాలో సగభాగం ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ గణన చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు సీఎం అభ్యర్థిగా బీసీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీసీల రిజర్వేషన్లు పెట్టాలని, 50శాతం సీట్లను బీసీలకు ప్రకటించాలన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలను ఏకం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాదులో ఐదు లక్షల జనాభాతో బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, స్థానిక నాయకులు కిషన్, శ్రీనివాసచారి, సదయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్యాంయాదవ్, కిషన్, చిరంజీవి, బుచ్చయ్య, రమేష్, అరవింద్ పాల్గొన్నారు.

# గుడిసెవాసులకు పట్టాలివ్వాలి




ర్యాలీలో నాయకులు, గుడిసెవాసులు

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని సర్వేనంబర్ 280లో గుడిసెలు వేసుకున్న పేద ప్రజలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం గణేష్ చౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నాలో రాజ్‌కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకుప్రవీణ్ కుమార్ మాట్లాడారు. పేద ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా పేదవాడికి సొంత ఇల్లు లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి గుడిసెవాసులకు పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, కొరిమి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, పీక రవికాంత్, సాబీర్, తిరుపతి, యాకూబ్, మహేష్, వెంకటేష్, రమేష్, వనిత, లావణ్య, సంధ్య, మహేశ్వరి, గోలి లావణ్య, వేగోలపు మమత, సుజాత, ప్రియాంక, స్వప్న, సుస్మిత పాల్గొన్నారు.

# సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

**కలెక్టర్ భవేష్‌మిశ్రా**



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 35 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**అదనపు కలెక్టర్‌కు అభినందనలు..**

అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సామ్యూల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సమన్వయంతో పని చేసి జిల్లాను ఉన్నతస్థాయిలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది ఆంజనేయులు, ఏడీ ఫిషరీస్ అవినాష్, డీఎస్‌డీఓ సునీత, ఎంపీడీఓలు డాక్టర్ అరుంధతి, సురేందర్ పాల్గొన్నారు.

**మోరంచపల్లి బాధితులకు టీజీఓ అధికారుల విరాళం..**

ఇటీవల కురిసిన భారీవర్షాలకు అతలాకుతలమైన మోరంచపల్లి, జిల్లాలోని ఇతర గ్రామాలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో జిల్లా గెజిటెడ్ అధికారులు, వైశ్య గెజిటెడ్ అధికారులు రూ. 2,27,122 చెక్కును సోమవారం జిల్లా అధ్యక్షుడు సామ్యూల్ ఆధ్వర్యంలో కలెక్టర్ భవేష్‌మిశ్రాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆంజనేయులు, శైలజ, సంజీవరావు, విజయలక్ష్మి, ఆశాలత, విజయభాస్కర్ పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భూపాలపల్లి: జిల్లాలో ప్రజాదివస్‌కు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ కరుణాకర్ సూచించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌కు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ సమస్యలపై బాధితుల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించాలన్నారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

# ఎన్‌క్వాస్ బృందం పరిశీలన




మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కాటారం: కాటారం మండలం బయ్యారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌క్వాస్ గుర్తింపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందం సోమవారం పరిశీలించింది. మంగ్లారం విష్ణోయి, కీర్తిమాన్ మహంతల బృందం ఆస్పత్రి నిర్వహణ, సేవల తీరు, పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలతో పాటు ఆస్పత్రికి సంబంధించిన పలు అంశాలపై వివరాలు సేకరించారు. ఎన్‌క్వాస్ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల అమలు తీరుపై ఆరాతీశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. వైద్యసేవలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ కొంరయ్య, ప్రోగ్రాం అధికారులు శ్రీదేవి, ఉమాదేవి, భానుకుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్లు కోల్పోయిన బాధితుల పేర్లు ఇవ్వాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ఆధార్ కార్డు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరదలతో ఇళ్లను కోల్పోయిన బాధితుల పేర్లను నిజాయతీగా రాసి ఇవ్వాలని కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్లకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్ వద్ద కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరదల్లో ఆధార్, రేషన్ కార్డులు కోల్పోయిన వారికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి సోమవారం ఇప్పించారు. ఈ క్యాంప్‌ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం అక్కడ ఉన్న ముంపు బాధితులతో, సర్పంచ్ వెంకన్నతో మాట్లాడారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు తక్షణ సాయం చేసేందుకు ఈ క్యాంప్‌ను ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. ఈ విషయంపై ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వరదల్లో ఇళ్లను కోల్పోయిన వారి పేర్లు మాత్రమే పారదర్శకంగా జాబితాను రాసి తహసీల్దార్‌తో సంతకం చేయించి రేపటిలోగా పంపించాలని వెల్లడించారు. అవసరం లేని వారి పేర్లు కూడా రాయడం వల్ల అన్ని ఇళ్లు క్యాన్సిల్ అయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. ముంపు బాధితులను ఆదుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి పలు రకాల అనుమతులు తీసుకున్నామని, తక్షణ సాయం కూడా అందజేస్తామన్నారు. ఇళ్ల విషయంలో మాత్రం ఎలాంటి అవకతవకలు జరిగినా ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు.

**పలు వినతులు**

వాజేడు, గుమ్మడిదొడ్డి, కృష్ణాపురం, బూటారం గ్రామాలకు చెందిన ముంపు బాధితులు తమకు కూడా ఇళ్లు ఇప్పించాలని, ఇప్పుడు ఉన్న ఇళ్లు ప్రభుత్వం తీసుకొని కొత్త స్థలంలో కట్టించి ఇవ్వాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు పలు వినతి పత్రాలను సమర్పించారు. అదేవిధంగా కొండాయిలో మృతి చెందిన 9 మందికి ఆర్థిక సాయం అందించాలని బాధితులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయంపై ఇప్పటికే అనుమతులు వచ్చాయని, త్వరలోనే పరిహారం అందుతుందని కలెక్టర్ వెల్లడించారు. 359 మందికి రేషన్ కార్డులు, సుమారు వెయ్యి మందికి ఆధార్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టామన్నారు.

**స్వచ్ఛందంగా సేవలు**

ముంపు బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మీసేవ పర్యవేక్షణ అధికారి దేవేందర్ నేతృత్వంలో 8 మీ సేవ కేంద్రాలు, 3 ఆధార్ కార్డుల సెంటర్ల ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేయించడంతో వారు స్వచ్ఛందంగా సేవలు అందించారు. ప్రజల నుంచి ఫీజులు లేకుండానే వారికి రేషన్, ఆధార్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, సర్పంచ్ ఈసం రామ్మూర్తి పాల్గొన్నారు.

పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు



# నిరాడంబరంగా 'అథ్లెటిక్స్' చాంపియన్‌షిప్

- హాజరైన 891 మంది క్రీడాకారులు
- మమ అనిపించిన నిర్వాహకులు
- నిరుత్సాహంగా వెనుదిరిగిన క్రీడాకారులు



మాట్లాడుతున్న 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు క్రీడాకారుల్లో నిరుత్సాహం నింపాయి. క్రీడాకారుల్లో నూతనోత్తేజం నింపి, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేలా సంకల్ప బలాన్ని అందించేందుకే చాంపియన్‌షిప్ నిర్వహిస్తుంటారు. అందుకే ప్రారంభోత్సవంతో పాటు ముగింపు వేడుకలకు ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించి, వారి అమూల్య సందేశంతో పాటు పతకాలు అందిస్తారు. దీని వల్ల క్రీడాకారుల్లో స్ఫూర్తి కలుగుతుంది. అయితే అథ్లెటిక్స్ అసోసియేషన్ సోమవారం అవేమి పట్టించుకోలేదు. పోటీలను మమ అనిపించి ముగించడంతో పతకాలు అందుకున్న క్రీడాకారులు నిరుత్సాహంగా వెనుదిరిగారు. హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14,16,18,20 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తెలంగాణలోని 32 జిల్లాల నుంచి 891 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాలబాలికలకు జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల పరుగు కేటగిరీల్లో నిర్వహించిన పోటీల ప్రారంభానికి 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, యుగేంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, మహేందర్, సమ్మయ్య, మనోజ్, కోచ్‌లు శ్రీమాన్, అశ్విని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 9నుంచి కేయూ ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ(దూర విద్యకేంద్రం) డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల మొదటి, ద్వితీయ, ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం తెలిపారు. డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 11, 17, 21, 24, 28, 31, సెప్టెంబర్ 4 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 10, 16, 19, 23, 26, 30, సెప్టెంబర్ 2, ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 9, 14, 18, 22, 25, 29, సెప్టెంబర్ 1, 5 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి సంవత్సరంలో 4,547 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,403 మంది, ఫైనల్ ఇయర్‌లో 5,343 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఆయా పరీక్షల నిర్వహణకు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు.





# కొలువు కొట్టారు..

ఈ విజయధీరులు లక్ష్యానికి పట్టుదల, కష్టపడే తత్వం తోడైతే సాధించలేనిది లేదని నిరూపించారు. పగలు, రాత్రి..ఎండా, వాన.. నింగినేలా..అనే తేడా లేకుండా నిరంతరం కష్టపడ్డారు. పుస్తకాలతో కుస్తీ పట్టారు.. గ్రంథాలయాలతో దోస్తీ కట్టారు. పరీక్ష కాలం మొత్తం ఆకలి లేదు.. దప్పిక లేదు. ఉన్నది ఒక్కటే ధ్యాస కొలువు కొట్టాలి. ఒక్కరా ఇద్దరా.. ప్రతీ పోస్టుకు వందల మంది పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్నారు. నిరంతరం కుర్చీకే అంకితమై దాదాపు రోజులో సగభాగం చదివారు. పరీక్షల్లో గురి చూసి లక్ష్యం విసిరి సఫలీకృతులయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎస్సై పోస్టులకు ఎంపికయ్యారు. వీరిలో ఒక్కొక్కరిది ఒక్కొక్క నేపథ్యం. వీరి విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం

## అమ్మ ఆశయం నెరవేర్చిన పుత్రులు..

- పెద్దకుమారుడు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా చిన్నకుమారుడు ఎస్సై పోస్టుకు ఎంపిక



మధు

నెక్కొండ: ఓ కొడుకు చంకలో.. మరో కొడుకు కడుపులో ఉండగా అనారోగ్యంతో భర్తను కోల్పోయినా తండ్రి లేనిలోటు రాకుండా సాకిందా తల్లి.. ఆమె కష్టానికి కుమారులు ప్రతిఫలం అందించారు. పెద్దకుమారుడు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా చిన్న కుమారుడు తాజాగా విడుదలైన ఫలితాల్లో ఎస్సై పోస్టుకు ఎంపికై ఆమె ఆశయం నెరవేర్చారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట్లకు చెందిన అనంతగిరి రవి 30 ఏళ్ల క్రితం మృతి చెందారు. అతడి భార్య రమకు అప్పటికే కొడుకు సిద్దార్థ ఉండగా మరో కొడుకు (7 నెలల గర్భం)ను మోస్తోంది. భర్తలేని లోటును దిగమింగుకుంటూ ఇద్దరిని చదివించింది. ఈ క్రమంలో సిద్దార్థ, మధు 2019లో సివిల్ కానిస్టేబుల్ పరీక్ష రాయగా సిద్దార్థ ఎంపికయ్యాడు. దీంతో తల్లి ఆశయం.. సోదరుడి స్ఫూర్తితో మధు 2022లో రైల్వే శాఖలో ఉద్యోగం సాధించి, విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, అంతకుముందే ఎస్సై పరీక్ష రాశారు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు.

## అన్నయ్య స్ఫూర్తిగా..

- సివిల్ ఎస్సై పోస్టుకు అర్చన ఎంపిక



అర్చన

దామెర: మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన చెందిన ఆకుల శ్రీశైలం, లక్ష్మి దంపతుల కూతురు అర్చన సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. శ్రీశైలం, లక్ష్మి దంపతులకు కుమారుడు గణపతి, కూతురు అర్చన ఉంది. గణపతి 2018–19 బ్యాచ్‌లో రిజర్వ్ ఎస్సైగా ఎంపికై ప్రస్తుతం మామునూర్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అర్చన.. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేసింది. అనంతరం ఎస్సై పరీక్ష రాశారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. అన్నయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఎస్సై పరీక్ష రాసి ఎంపికయ్యానని అర్చన తెలిపారు.

## తల్లిదండ్రుల కృషితో సాధించా..



కొండ సురేష్

నర్సింహులపేట: నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన కొండ వెంకన్న, పద్మ దంపతుల కుమారుడు సురేష్ ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. తాను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదన్నారు. లక్ష్యం విధించుకుని నిరంతరం చదివానన్నారు. కాగా, నెల క్రితం కాచిగూడలో రైల్వే గ్రూప్–డీ ఉద్యోగిగా జాయిన్ అయ్యానని తెలిపారు. తల్లిదండ్రుల కృషితోనే తాను సివిల్ ఎస్సై ఉద్యోగం సాధించానన్నారు.

## కష్టపడి చదివి..లక్ష్యం సాధించి

- ఎస్సై పోస్టుకు గోవర్ధన్ ఎంపిక



గోవర్ధన్

సంగెం: మండలంలోని వంజరపల్లి గ్రామానికి చెందిన పొన్నాల సుగుణ, జనార్దన్ దంపతుల చిన్న కుమారుడు గోవర్ధన్ ఎస్సై ఉద్యోగం సాధించారు. 2018లో టీఎస్‌ఎస్‌పీ కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అయితే కానిస్టేబుల్ ఉద్యోగానికి సంతృప్తి చెందని గోవర్ధన్.. నిరంతరం కష్టపడి పట్టుదలతో చదివి ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. కాగా, గోవర్ధన్‌ను సర్పంచ్ పెంతల స్రవంతి అనిల్, గ్రామస్తులు అభినందించారు.

## కర్షక కుటుంబం నుంచి ఖాకీ వనంలోకి ..

- ఎస్సై పోస్టుకు కూన వినయ్ ఎంపిక
- తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆనందం



కూన వినయ్

పాలకుర్తి: పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన కూన హైమ–మల్లయ్య దంపతుల కుమారుడు వినయ్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో వినయ్ ప్రతిభ చూపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి కష్టపడి ఉద్యోగం సాధించినట్లు వినయ్ తెలిపారు. తల్లిదండ్రుల సహకారంతో తాను ఈ కొలువు సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఎస్సైగా ఎంపికైనందుకు ఆనందంగా ఉందన్నారు. కాగా, తన కుమారుడు ఎస్సై కావడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. అలాగే, వినయ్.. ఎస్సై పోస్టుకు ఎంపిక కావడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వినయ్ అంతకుముందే రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్), రైల్వే గ్రూప్–డీలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం రైల్వే గ్రూపు డీలో విధులు నిర్వర్తిస్తూ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు.

## గ్రంథాలయంలో ప్రిపరేషన్..

- ఎస్సై పోస్టుకు రఘుబాబు ఎంపిక



రఘుబాబు

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన బూర నారాయణ, శోభారాణి దంపతులది నిరుపేద కుటుంబం. కూలీకి వెళ్తేగాని పూటగడవదు. అలాంటి వారి ఇంట్లో వెలుగులు నిండాయి. ఆ దంపతుల కుమారుడు రఘుబాబు ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. రఘుబాబు టెన్త్ వరకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. మాసాబ్‌టాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేశాడు. బీటెక్ చదవడానికి డబ్బు సరిపడలేదు. దీంతో ఓపెన్ డిగ్రీ చేశాడు. ఈ సమయంలోనే మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుకునే వాడు. ఎస్సై కావాలనే పట్టుదలతో ముందుకు సాగి మొదటి ప్రయత్నంలోనే కొలువు సాధించాడు. ఎస్పీఎఫ్ విభాగంలోఎస్సై ఉద్యోగం సాధించాడు. దీంతో నిరుపేద ఇంట్లో వెలుగు నిండింది. ఊరంతా సంబురాలు చేసుకుంది.

## పట్టుదలతో చదివి..

- ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన హేమలత



బొల్లెబోయిన హేమలత

కొత్తగూడ : కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన బొల్లెబోయిన హేమలత ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన బొల్లెబోయిన పద్మ, కుమార స్వామి దంపతుల పెద్ద కూతురు హేమలత చిన్నప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులకు చలించిపోయేది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూనే పట్టుదలతో చదువు కొనసాగించింది. ఈ క్రమంలో ఎస్సై ఉద్యోగానికి ఎంపికైంది. ఎస్సై పోస్టుకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు. కాగా, తమ కూతురు ఎస్సైగా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని తల్లిదండ్రులు పద్మ, కుమారస్వామి తెలిపారు.

## అవాంతరాలు ఎదురైనా..

- లక్ష్యం చేరుకున్న మహేష్
- సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపిక



మహేష్

పాలకుర్తి : మండలంలోని బమ్మెర గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మహేష్ సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. శివరాత్రి లక్ష్మి, సోమయ్య దంపతుల కుమారుడు మహేష్ నిరంతరం కష్టపడి చదివి లక్ష్యం చేరుకున్నారు.ఈ ప్రయత్నంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముందుకు సాగి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. కాగా, మహేష్ ఎంపికపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సెలవు పెట్టి.. నౌకరి కొట్టి!

- ఎస్సై పోస్టుకు కొత్తూరు యువకుడు బండారి శివ ఎంపిక
- ఆనందంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు



శివ

ఖానాపురం : కష్టపడి చదివాడు.. కోరుకున్న కొలువు సాధించాడు. ప్రస్తుతం విధులు కొనసాగిస్తున్నాడు. అయినా ఏదో వెలితి. ఇంతకంటే మెరుగు కొలువు సాధించాలనే లక్ష్యం విధించుకున్నాడు. దీనికి విధులు అడ్డుగా వస్తున్నాయని సెలవు తీసుకున్నాడు.. అనంతరం కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఖానాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బండారి మల్లయ్య, ఐలమ్మ దంపతుల కుమారుడు శివ 2016లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం గంగారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తనతో పాటు 2016లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాని వారు మరో ప్రయత్నంలో ఎస్సై ఉద్యోగం సాధించారు. దీంతో తాను కూడా ఎస్సై ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. చదువు కోసం ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే కారణంతో మూడు నెలలు విధులకు సెలవు తీసుకున్నారు. హనుమకొండలో ఓ గదిలో ఉంటూ సెంట్రల్ లైబ్రరీలో చదువుకున్నాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 242 మార్కులు సాధించి ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో ఆ కుటుంబంలో ఆనందం నెలకొంది. కాగా, గ్రూప్–1 సాధించడమే లక్ష్యమని, ప్రిలిమ్స్ అర్హత సాధించినట్లు శివ తెలిపారు.

## ఏఎస్‌ఐ కొడుకు ఎస్సై..

- రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికైన దిలీప్



దిలీప్

కాశిబుగ్గ: ఏఎస్ఐ కొడుకు ఎస్సై కానున్నారు. ఆదివారం ప్రకటించిన ఎస్సై ఫలితాలలో వరంగల్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన లింగాల దిలీప్ సివిల్ ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యారు. శాంతినగర్‌కు చెందిన లింగాల మోహన మురళి, స్వరూపరాణి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక్క కూతురు ఉన్నారు. దిలీప్ తండ్రి మోహన మురళి నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, దిలీప్ రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్సైకు ఎంపికయ్యారని తండ్రి మోహన మురళి తెలిపారు. కాగా, దిలీప్‌ను 'సాక్షి' పలకరించంగా తన అన్న, చెల్లి, బావ ప్రోత్సాహంతో ఎస్సై ఉద్యోగం సాధించానని తెలిపారు. కార్పొరేటర్ నరేంద్రకుమార్, జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెండ్యాల సోనిబాబు, పలువురు.. దిలీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నాడు సైనికాధికారి..

- నేడు పోలీసు అధికారి..
- సివిల్ ఎస్సై పోస్టుకు రాజేష్ ఎంపిక



రాజేష్

పరకాల: దేశాభిమానం ఆయనను 17 సంవత్సరాల వయస్సులోనే సైనికుడు అయ్యేలా చేసింది. సైనికుడిగా..సైనికాధికారిగా 18 ఏళ్లు దేశ సరిహద్దులలో పనిచేశారు. అనంతరం ప్రజలలో ఉంటూ సేవ అందించాలని భావించి నిరంతరం కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం చేరుకున్నారు. ఆయనే పరకాల పట్టణానికి చెందిన రిటైర్డ్ సైనికాధికారి పిట్ట రాజేష్. ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు ఆనంద సాగరంలో మునిగారు.

# సాక్షి క్లాసిఫైడ్స్

## REAL ESTATE

### HOUSE FOR SALE

- మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785639]
- కేవలం రూ॥ 25 లక్షలకే డబుల్ బెడ్ రూం హౌస్ విత్ ఫర్నీచర్‌తో EMI పద్దతిలో అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9933]

### PLOT FOR SALE

- AMR Township నందు కమర్షియల్ ప్లాట్స్ రఘునాథపల్లి Toll Plaza, 163 Highway Facingతో అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9931]
- వరంగల్ నుండి 18 కి.మీ. దూరంలో కేవలం 7 లక్షలకే 200 చ॥గ॥ల రిజిస్ట్రేషన్ ప్లాటు (E/F) అమ్మబడును. వివరాలకు సంప్ర. 95736 89941. [M-9932]

### TO-LET

- To-Let 2BHK Marble Stone Fitting, 1000+1000 Sq. Feet Wide Space Big House For Residential & Office 1st Floor, @ Waranagal Under Bridge. Ph: 9440170497. [HA-484]

## SERVICES

- మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

## BUSINESS OFFER

- Learn & Earn in Currency Trading Master one Pair one Strategy one Trade Every day. Contact : 8591712181. [WB-20553]

## CHANGE OF NAME

- I, SYED ASADULLAH HUSSAINI father of Syed sadia Hussaini R/o H/No1-7-699, Shanthinagar, subedari, Hanmakonda, Warangal-506001, T.S India here by state that I have changed my daughter name sadia Hussaini (old name) to SYED SADIA HUSSAINI (New name). [W-785640]
- I, SYED ASADULLAH HUSSAINI father of Syed kaina safaa Hussaini R/o. H.No 1-7-699, Shanthinagar, Subedari, Hanmakonda, Warangal - 506001, T.S, India here by state that I have changed my daughter name kaina safaa Hussaini (old name) to SYED KAINA SAFAA HUSSAINI (New name). [W-785641]
- I, ASRAF SULTANA (Old Name), R/o. H.No. 2-7-145, Busstand Road, Jangaon Town and Mandal, Jangaon District I have changed my name as ASHRUF SULTHANA, W/o. Imamuddin Mohammed, (New name) for all future purposes. [W-189123]

## OLD AGE HOME

- త్రివేణి హోంకేర్: వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ 9160900023, 9160900024. [H-189316]

## WANTED

- Wanted PRO's for Degree and MBA Admissions (College having more than 20 years Experience). Contact Cell: 9618722575. [WA-13320]
- శ్రీ సంతోష్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూరు బ్రాంచిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్, TA + DA ఇవ్వబడును. సెల్: 7702403972. [W-785636]



- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11729]
- ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ ప్రతినెల 25 వేల పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్ పైన, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్, స్టూడెంట్స్ వివరాలకు సంప్ర : 88606 48112 [V- 797260]



### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌గా పరిగణించాలి



సమావేశంలో పాల్గొన్న అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు, అర్చకులు

హన్మకొండ కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ధూప దీప నైవేద్య (డీడీఎన్) అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించడానికి డీడీఎన్ స్కీం అనే పదాన్ని తొలగించి పూర్తిస్థాయిలో దేవాదాయ శాఖలో గ్రూపు ఆఫ్ టెంపుల్స్ గా పరిగణించాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. వేయిస్తంభాల దేవాలయం ఆవరణలోని కుడా గార్డెన్స్‌లో సోమవారం రాష్ట్ర డీడీఎన్ అర్చకుల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీడీఎన్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్‌శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందు ప్రజా గాయకుడు గద్దర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశంలో గంగు ఉపేంద్రశర్మ, డీడీఎన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నా మోహన్‌శర్మ, అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కపురం నారాయణస్వామి, గౌరవాధ్యక్షుడు ఆంజనేయ చారి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం డీడీఎన్ అర్చకులకు వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్‌కుమార్‌చారి, బ్రహ్మచారి, నర్సింహాచారి, రావులచారి, నాగరాజ్, సంపత్‌కుమారాచారి, ప్రభాకరాచారి, బాలరాజు పాల్గొన్నారు.

## స్టైఫండ్ పెంచాల్సిందే..

- ఆయుర్వేద వైద్య విద్యార్థుల విధుల బహిష్కరణ
- ఆస్పత్రి ఎదుట ధర్నా




ఆయుర్వేద ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

కాశిబుగ్గ: ప్రభుత్వం తమకు స్టైఫండ్ పెంచాల్సిందేనని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. మూడో రోజు సోమవారం వరంగల్ ప్రభుత్వ బోధన వైద్యశాల, వైద్య కళాశాల ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజులుగా ఆయుష్ విద్యార్థులు కళాశాలలు, వైద్యశాలల ఎదుట నిరసన, ధర్నాలు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. హైకోర్టు సైతం అల్లోపతి వైద్య విద్యార్థులకు మాదిరిగా ఆయుష్ విద్యార్థులకు స్టైఫండ్ పెంచి ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్టైఫండ్ పెంచి ఇవ్వాలని లేదంటే కళాశాలలో తరగతులు, వైద్యశాలలో విధులు బహిష్కరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కళాశాల, వైద్యశాలల ఎదుట విద్యార్థులు నిర్వహిస్తున్న ధర్నాకు హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ డాక్టర్ బాల్నె సాంబమూర్తి, డాక్టర్ వి.మోహన్‌రావు, డాక్టర్ రవీందర్ మద్దతు పలికారు. ఈ ధర్నాలో ఆయుర్వేద హౌస్ సర్జన్లు నవీన్, కిశోర్, హిమజ, మహేశ్వరి, మొదటి, ఫైనలియర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ బీభత్సం..

- రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలపైకి దూసుకెళ్లిన వాహనం
- ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ ద్విచక్రవాహనదారుడి మృతి



లారీ కింద ఇరుక్కున్న రంజిత్



రంజిత్ (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న లారీ పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ దాటిన తరువాత రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, కార్లపైకి దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనం పార్కింగ్ చేస్తుండగా గణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన వెలిశెట్టి రంజిత్(30)ను ఢీకొంది. దీంతో 20 మీటర్ల మేరకు లారీ కింద ఇరుక్కుని వాహనంతోపాటు ముందుకెళ్లాడు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని భారీ క్రేన్ సహాయంతో సుమారు 30 నిమిషాలు శ్రమించి లారీని పైకి లేపి కింద ఇరుక్కున్న రంజిత్‌ను బయటకు తీశారు. అనంతరం అంబులెన్స్‌లో హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతూ సాయంత్రం 6గంటలకు మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

### 10బైక్‌లు, రెండు కార్లు ధ్వంసం

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలపైకి లారీ దూసుకొచ్చింది. ఈ ఘటనలో 10 ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జుకాగా రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

### షాపింగ్ కోసం వచ్చి మృత్యు ఒడికి..

రంజిత్, అనూష దంపతులు షాపింగ్ కోసం భూపాలపల్లికి వచ్చినట్లు తెలిసింది. వస్త్ర దుకాణం ఎదుట అనూషను దింపిన రంజిత్..అనంత రం తన వాహనం పార్కింగ్ చేస్తున్నాడు. ఇంతలోనే మృత్యువు రూపంలో ఇసుక లారీ దూసుకువచ్చింది. తన కళ్ల ముందే రంజిత్ లారీ కింద ఇరుక్కుని వెళ్తుండడంతో అనూష విలవిలాడింది. 40 నిమిషాలు లారీ కిందనే ఇరుక్కొని ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. కాగా, రంజిత్ స్వగ్రామం హనుమకొండ జిల్లా మడికొండ కాగా చెల్పూర్ కేటీపీపీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తూ చెల్పూర్‌లో నివసిస్తున్నారు.

## విశ్వబ్రాహ్మణులు సేవాస్ఫూర్తితో పనిచేయండి

- తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి



పూలే సాహిత్యాన్ని ఆవిష్కరిస్తున్న బాలాచారి

హన్మకొండ చౌరస్తా: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతికి మహోన్నతమైన చరిత్ర ఉందని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అన్నారు. హనుమకొండ అలంకార్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం 'మహాత్మ జ్యోతిరావు పూలే' సాహిత్య పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలాచారి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు సేవకు మారుపేరని, నిత్యం చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు ఆదుకునేలా నాయకులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు రవీంద్రాచారి, సదానందం, వీరన్న, మోహన్, చక్రపాణి, సురేష్, మోహన్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రకాశం, నాగారాజారావు, రాధాకృష్ణ, విష్ణువర్ధన్, జగదీశ్వర్, రమేష్ బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.